www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 11 జులై 2023



నియామక పత్రాలు అందజేత

ప్రజాశక్తి-నెల్లూరు
2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి కస్తూరి బాలిక విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న వివిధ పోస్టులకు సంబంధించిన ఉద్యోగ నియామక పత్రాలను అభ్యర్థులకు జిల్లా విద్యాశాఖ అధికారి ఆర్ఎస్ గంగాభవాని అందజేశారు. సోమవారం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో జిల్లాలో 12 కస్తూరి బా బాలిక విద్యాలయాల్లో ఉన్న ఖాళీలకు సంబంధించి వివిధవంటి 42 ఉపాధ్యాయ పోస్టులకు నేడు 36 మంది వివిధ కేటగిరీలలో కౌన్సిలింగ్ నిర్వహించి, వారికి కేటాయించబడిన ఉద్యోగ నియామక పత్రాలను అభ్యర్థులకు అందజేశారు. జిసిడిఒ మమత, సెక్షన్ అసిస్టెంట్ వేణు, మహేష్ పాల్గొన్నారు.

మట్టి, గ్రావెల్ మాఫియా బరితెగింపు..!

○అడ్డదిడ్డంగా తవ్వకాలు
○అధికారుల పర్యవేక్షణ లోపం
○పదుల సంఖ్యల్లో మృత్యువాత

మట్టి, గ్రావెల్, ఇసుక మాఫియా చెలరేగిపోతుంది. వివిధ రకాల ప్రాజెక్టుల కోసం ఇసుక, మట్టి తవ్వకాలు సాగుతున్నాయి. గ్రావెల్, మట్టిని జిల్లాలో రియల్ ఎస్టేట్ వ్యాపారులు అడ్డదిడ్డంగా తవ్వకాలు చేస్తున్నారు. అక్రమ లేఅవుట్లలో, అక్రమ మాఫియా ఆగడాలు సాగుతున్నాయి. ఇరిగేషన్, రెవెన్యూ, పోలీసు అధికారులు నిద్ర నటిస్తున్నారు. అధికారుల వద్ద అనుమతులు తీసుకొచ్చి అందుకు విరుద్ధంగా ఇష్టం వచ్చిన విధిగా తవ్వకాలు చేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా అనేక మంది పిల్లలు, యువకులు గుంతల్లో పడి మృత్యువాత పడ్డారు. అయినప్పటికీ కొందరి ధనదాహానికి సామాన్య ప్రజలు ప్రాణాలు బలి తీసుకుంటున్నారు.

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి
మట్టి, గ్రావెల్, ఇసుక బంగారంలా మారింది. గతంలో వీటి అవసరం అంతంత మాత్రంగానే ఉండేవి. ఇటీవల కాలంలో ప్రభుత్వ విధానాల కారణంగా గత ప్రభుత్వంలో ఇసుక ఉచితంగా అందజేసేవారు. వైసిపి అధికారంలోకి రాగానే భారీగా ఇసుక ధరలు పెంచారు. నెల్లూరు నగరంలో 2019 ముందు ట్రాక్టర్ ఇసుక బాడుగతో కలిపి రూ.900 వచ్చేది. ఇప్పుడు అదే ట్రాక్టర్ ఇసుక రూ. 4వేల వరకు పలుకుతోంది. అప్పట్లో టిప్పర్ ఇసుక రూ.3 వేలు ఉండేది, ఇప్పుడు రూ.18వేల వరకు అమ్ముతున్నారు. జిల్లాలో భవన యజమానులు విధిలేని పరిస్థితుల్లో కొనుగోలు చేసుకుంటున్నారు. ఇదే సమయంలో నెల్లూరు ఇసుకకు బెంగళూరు, హైదరాబాద్, చెన్నయ్ నగరాల్లో మంచి గిరాకీ ఉంది. ఇక్కడ నుంచి అక్రమంగా రవాణా సాగిస్తున్నారు. దీనికి కొందరు వ్యక్తులు భారీ వ్యాపారంగా మార్చుకున్నారు. ప్రభుత్వం జిల్లాలోని పలు ప్రాంతాల్లో తవ్వకాలు చేస్తుంది. అక్కడ నుంచి డంపింగ్‌యాడ్‌కు తరలించి అక్కడ నుంచి కంపెనీల ద్వార అమ్మకాలు సాగిస్తుంది. పెన్నా, స్వర్ణముఖి, కాళంగి, నదుల్లో ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా తవ్వకాలు సాగిస్తున్నారు. దీనిపై విమర్శలు వస్తున్నా అదికారులు స్పందించడం లేదు. గ్రావెల్ ఇదో పెద్ద ఘరనా మాఫియాగా తయారైంది. కావలి కేంద్రంగా అక్కడ అధికారపార్టీ నేతల అండదండలతో బిట్రగుంట, కావలి, అల్లూరు, జలదంకి, ప్రాంతాల్లో టిప్పర్లు, టిప్పర్లు గ్రావెల్ తరలిపోతోంది. ప్రభుత్వం నుంచి కొద్దిపాటి అనుమతి తీసుకొని పక్కన ఉండే

పొలాలు సైతం తవ్వకాలు చేస్తున్నారు. అల్లూరు మండలం, సౌత్ ఆములూరులో ప్రయివేటు వ్యక్తుల పొలాల నుంచి గ్రావెల్ తరలించారు. అక్కడ రెవెన్యూ అధికారులకు తెలిసినా నోరు మెదపడం లేదు. అధికారపార్టీ నేతల జోక్యంతో చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఓ అధికారి హస్తమున్నట్లు ప్రచారం సాగుతోంది. అధికారపార్టీ నేత ఆయనను అక్కడ పోస్టింగ్ వేయించుకొని ఈ దందా సాగిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. ఇప్పుడు ఓ ప్రజాప్రతినిధి సతీమణి కనుసైగల్లో ఈ వ్యవహారం నడుస్తుందని పెద్ద ఎత్తున విమర్శలు వస్తున్నాయి. ఎవరైనా మాట్లాడితే మా ఇష్టం వచ్చినట్లు చేస్తాం, ఏం చేస్తారనే ధోరణితో వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. చెరువుల్లో పూడిక తీసే పనుల పేరుతోనూ మట్టి దందా సాగుతోంది. రైతుల పొలాలకు మట్టి తవ్వుకోడానికి జిఒ నెంబర్ 2026 ప్రకారం క్యూబిక్ మీటర్ ఒక్క రూపాయి చెల్లించాలి, ప్రవేటు వ్యక్తులకు రూ. 231 క్యూబిక్ మీటర్ చెల్లించాల్సి ఉంటుంది. రైతుల పేరుతో బిల్లు తీసుకొని ప్రయివేటు వ్యక్తులకు తవ్వకాలు చేస్తున్నారు. మట్టి, గ్రావెల్ మొత్తం జిల్లాలోని లేవుట్‌లకు తరలిస్తున్నారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా సుమారు 250 నుంచి 300 లే అవుట్‌లు వేశారు.ఇన్నింటికీ గ్రావెల్, ఇసుక తవ్వకాలు చేశారు. ఇది పెద్ద వ్యాపారం అయినప్పటికీ ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయానికి గండి కొడుతున్నారు. అధికారులు మాత్రం అధికారపార్టీ నేతలకు బయపడి ఏం చేయకుండా మౌనంగా ఉంటున్నారు.

పలువురు మృత్యువాత..!
జిల్లా వ్యాప్తంగా ఇసుక, గ్రావెల్, మట్టి మాఫియా ధనదాహానికి చిన్నారులు మృత్యువాత పడుతున్నారు. పెన్నా నది పరివాహక ప్రాంతంలో గోద నిర్మాణానికి పెద్ద ఎత్తున గుంతలు తవ్వకాలు చేశారు. అక్కడ ఎలాంటి హెచ్చరికలు లేకపోవడంతో చిన్నారులు ఆడుకుంటూ వెళ్లి గుంతల్లో పడ్డారు. వీరిని రక్షించడానికి వెళ్లిన ఇద్దరు ముస్లిం మహిళలు మృతి చెందారు. పొదలకూరు మండలం, తోడేరు చెరువులోకి వెళ్లిన ఆరుగురు యువకులు పడవబోల్తా పడి మృతి చెందారు. చిట్టమూరు మండలం, గునుపాడు గ్రామంలో ఇసుక గుంతల్లో పడి ఓ వ్యక్తి మృతి చెందారు. వెంకటాచలం మండలంలో చెరువు గుంతల్లో పడి చిన్నారి మృతి చెందారు. పెన్నానదిలో బుచ్చిరెడ్డిపాళెంలో మరో ఇద్దరు యువకులు మృతి చెందారు. వేసవి సెలవుల్లో ఈత కోసం వెళ్లి గుంతల్లో పడి మృతి చెందారు. మాఫియా పట్ల ప్రభుత్వం స్పందించకుంటే ప్రజల ఆస్తులకు, ప్రాణాలకు ప్రమాదం జరిగే అవకాశం ఉంది.

కదంతొక్కిన అంగన్‌వాడీలు

సమస్యల పరిష్కారం కోరుతూ మహాధర్నా

మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు

ప్రజాశక్తి -నెల్లూరు : అంగన్‌వాడీలు సమస్యల పరిష్కారం కోరుతూ కలెక్టరేట్ ఎదుట చేస్తున్న 36 గంటల ధర్నా ఆరంభం మాత్రమేనని.. సమస్యలకు పరిష్కారం చూపకపోతే నిరవధిక పోరాటానికి దిగుతారని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు పేర్కొన్నారు. ఐసిడిఎస్‌కు ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపు పెంచాలని, తెలంగాణ రాష్ట్ర కన్నా అదనంగా వేతనాలు పెంచాలని, సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి గ్రాట్యూటీ అందజేయాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత కొర్కెల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట 36 గంటల ధర్నా సోమవారం మహాధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమంలో భాగంగా సుమారు 3 వేల మంది అంగన్‌వాడీలు విఆర్‌సి క్రీడా మైదానం కలెక్టరేట్ వరకూ భారీ ప్రదర్శన చేపట్టారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు సభకు ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్ యూనియన్ జిల్లా కార్యదర్శి షేక్ రెహనాబేగం, వై.సుజాతమ్మ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు మాట్లాడుతూ దేశంలో ఐసిడిఎస్ సంస్థ పరిధిలో 14 లక్షల అంగన్‌వాడీ సెంటర్లు ఉన్నయన్నారు. ఆయా సెంటర్లలో 25 లక్షల మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. వారంతా 10 కోట్ల మందికి పోషకాహారం నిరంతరం అందజేస్తున్నారన్నారు. అటువంటి అంగన్‌వాడీలకు రాష్ట్ర ప్రభుత్వం కనీస హక్కులు కల్పించాలన్నారు. ఐసిడిఎస్ సంస్థను నిర్వీర్యంచేయాలని కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తుందన్నారు. ప్రయివేటు సంస్థలకు కట్టబెట్టాలని ప్రయత్నం చేస్తుందన్నారు. అందులో భాగంగానే నిధుల కేటాయింపు లేకుండా వ్యవహరిస్తుందన్నారు. ఈ తరుణంలో ఐసిడిఎస్ సంస్థను పరిరక్షించుకోవాలన్నారు. ఐసిడిఎస్ సంస్థను రక్షించాలన్నదే అంగన్‌వాడీల ప్రధాన డిమాండ్ అన్నారు. సంస్థలో25 లక్షల మంది కేవలం గౌరవ వేతనంతో పనిచేస్తున్నారని, వారందరికీ ప్రభుత్వం ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఐసిడిఎస్ సంస్థలో పనిచేస్తున్న వారందరికీ సర్వీసు పెన్షన్లు ఉన్నాయని, సమయాలు పాటిస్తున్నారని, వీరందరికీ ప్రభుత్వం అపాయింట్‌మెంట్ ఆర్డర్ ఉందని, వారు సేవలు చేస్తున్నారని, ఈ నేపథ్యంలో వారందరినీ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. గ్రాడ్యూటీ కల్పించాలని 2022 అక్టోబరు 25 తేదిన సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందన్నారు. న్యాయస్థానం ఇచ్చిన తీర్పును రాష్ట్ర పభుత్వం గౌరవించాలన్నారు. అంగన్‌వాడీల సమస్యలను వైసిపి ప్రభుత్వం ఆలకించకపోతే నిరవధిక పోరాటానికి సైతం అంగన్‌వాడీలు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి షేక్ రహెనాబేగం, వై.సుజాతమ్మ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి రాకముందు చేసిన హామీలు తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీలపై వేధింపులను నివారించాలన్నారు. సిఐటియు జిల్లా కార్యదర్శి కె. అజయ్‌కుమార్ మాట్లాడుతూ అంగన్‌వాడీ వర్కర్స్ ప్రభుత్వం చేసిన హామీలు అమలు చేయాలని కోరుతున్నారని, ప్రభుత్వానికి చిత్త శుద్ధి ఉంటే హామీలను అమలు చేయాల న్నారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు టి.వి.వి ప్రసాద్, శ్రామిక మహిళా నాయకురాలు దుగ్గిరాల అన్నపూర్ణమ్మ, షేక్ మస్తాన్‌బీ, షేక్. షాహీనా బేగం, కె.పద్మా,శివకుమారి, కత్తి శ్రీనివాసులు, కిన్నెర కుమార్, అల్లాడిగోపాల్, కొండా ప్రసాద్, కందుకూరు సిఐటియు నాయకులు ఉన్నారు.

కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

ఓటర్ జాబితాను పునఃపరిశీలించాలి : టిడిపి

ప్రజాశక్తి-కందుకూరు :కందుకూరు నియోజకవర్గం ఓటర్ జాబితాలను పునః పరిశీలన చేసి చనిపోయిన, డబుల్ ఎంట్రీ ఓటర్లను తొలగించాలని కందుకూరు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ఇంటూరి నాగేశ్వర రావు కోరారు. పోలింగ్ కేంద్రాల వారీగా అందుకు సంబంధించిన వివరాలను సబ్ కలెక్టర్ శోభికకి స్పందన కార్యక్రమంలో సోమవారం అందజేశారు. వెంటనే విచారణ జరిపించి ఓటరు జాబితాల నుంచి అలాంటి ఓట్లు తొలగిస్తామని సబ్ కలెక్టర్ బదులిచ్చారు. రాష్ట్ర బిసి సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి చిలకపాటి మధు, రాష్ట్ర తెలుగు యువత ప్రధాన కార్యదర్శి బెజవాడ ప్రసాద్, నియోజకవర్గ క్రిస్టియన్ సెల్ అధ్యక్షుడు రెబ్బవరపు మాల్యాద్రి, మైనారిటీ సెల్ అధ్యక్షుడు షేక్ సలాం ఉన్నారు.

డిగ్రీ పరీక్షలకు 127 మంది గైర్హాజరు

వెంకటాచలం : డిగ్రీ పరీక్షల్లో 127మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు పరీక్షల నిర్వహణ అధికారి ప్రభాకర్ తెలిపారు. విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం పరిధిలోని అను బంధ కళాశాలలో సోమవారం జరిగిన డిగ్రీ ఐదో సెమిస్టర్ పరీక్షలో మొత్తం 363 మంది విద్యార్థులకు గానూ 324 మంది విద్యార్థులకు హాజరయ్యారని తెలిపారు. కోవిడ్ నిబంధనలు పాటిస్తూ పరీక్షలు నిర్వహించినట్లు ప్రభాకర్ తెలిపారు.

రామాయపట్నం పోర్టులో స్థానికులకే ఉద్యోగావకాశాలు కల్పించాలి

సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నరసింగరావు

నెల్లూరు :జిల్లాలోని రామా యపట్నం పోర్టులో స్థానికులకే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నరసింగరావు డిమాండ్ చేశారు. సోమవారం విఆర్‌సి క్రీడా మైదానంలో ఆయన విలేకర్లతో మాట్లా డారు. పోర్టు వస్తే ఈ ప్రాంత యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తాయని వైసిపి ప్రభుత్వం హామీ ఇచ్చిందన్నారు. ఆ హామీ ఆచరణలో ఆదిలోనే హంస పాదు లాగా రామాయ పట్నం పోర్టు ప్రాంత యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దక్కకపోగా చివరకు నాన్ టెక్నికల్ సెక్యూరిటీ గార్డు పోస్టులను సైతం ఇతర రాష్ట్రాల వారిని నియమించుకోవడం ఎంత వరకు న్యాయమని ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సెక్యూరిటీ గార్డుగా పనిచేసేందుకు సైతం ఈ ప్రాంతంలోని యువత పనికిరారా అని ఆయన ప్రశ్నించారు. రామాయపట్నం పోర్టు కోసం త్యాగం చేసిన మత్స్య కారులకు తమ తమ

మాట్లాడుతున్న సిహెచ్ నర్సింగరావు

ఇళ్లను ఖాళీ చేసే ఈ సందర్భంలో ఒక్కొక్కరికి రోజుకు రూ.150 నగదు, నెలకు బస్తా బియ్యం ఇస్తామని ప్రభుత్వం చెప్పిందన్నారు. నేటి వరకు ఈ హామీ అమలుకు నోచుకోలేదన్నారు. ఈ ప్రాంతంలోని మత్స్యకారులకు గడిచిన మూడు నెలల నుంచి వేటకు వెళ్లేందుకు అవకాశం లేదన్నారు. మహిళలకు పనిలేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. చేపల వేటను నమ్ముకొని జీవనం సాగిస్తున్న మత్స్య కార కుటుంబాలు ఏలా జీవించాలని ఆయన ప్రశ్నించారు. మత్స్యకారుల ఇళ్ల నిర్మాణానికి రూ. 10లక్షలు మంజూరు చేయాలన్నారు. పరిశ్రమను అభివృద్ధి చేసేందుకు స్థానికుల సహకారం తీసుకోవాలని, అవసరం లేకపోయినప్పటికీ కేవలం రాజకీయ కక్షలతో 600 ఎకరాల భూమిని తీసు కొనేందుకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసిందని, గ్రామస్తులు అందరూ దానిని వ్యతిరేకించడంతో భూసేకరణ తాత్కా లికంగా ఉపసంహరించుకున్నారన్నారు. అదే విధంగా రహదారి నిర్మాణం కోసం చేవూరు దళితుల వద్ద ప్రభుత్వం తీసుకున్న 3 ఎకరాల భూమికి నష్ట పరిహారం చెల్లించాలని, నూతనంగా నిర్మించిన కాలనీలకు గుడి, బడి, వాటర్ ప్లాంట్ నిర్మించాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు టి.వి.వి. ప్రసాద్, కె. అజయ్ కుమార్, కష్ణ పట్నం పోర్టు, రామాయ పట్నం పోర్టు కన్వీనర్లు గోగుల శ్రీనివాసులు, జి.వెంకటేశ్వర్లు , సిఐటియు నాయకులు జి.నాగేశ్వరరావు, కిన్నెర కుమార్, భ.వ.కా కార్యదర్శి అల్లాడిగోపాల్, ఐద్వానేత రెహెనాబేగం ఉన్నారు.

15,16 తేదీల్లో లోకేష్ పాదయాత్ర

ప్రజాశక్తి-కందుకూరు : టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర ఈనెల 15, 16 తేదీల్లో కందుకూరు నియోజకవర్గంలో జరుగుతుందని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. 15వ తేదీ ఉదయం 10 గంటలకు లింగసముద్రం మండలం, రాళ్లపాడు పంచాయతీలోని కొత్తపేట వద్ద లోకేష్‌కి ఘన స్వాగతం పలుకుతామన్నారు. అనంతరం రాళ్లపాడు ప్రాజెక్టు మీదుగా పాదయాత్ర మొదలై మధ్యాహ్నం 1 గంటకు జంపాలవారి పాలెం వద్దకు చేరు తుందన్నారు. మధ్యాహ్నం భోజన విరామం అనంతరం లింగసముద్రం, వెంగళాపురం గ్రామా మీదుగా పాదయాత్ర రాత్రి 8 గంటలకు - వలేటివారి పాలెంకు దక్షిణం వైపు, గాంధీనగర్ వద్దకు చేరుకుంటుందన్నారు. 16వ తేదీ సాయంత్రం గంటలకు వలేటివారిపాలెంలో బహిరంగసభ జరుగుతుందన్నారు. జయప్రదం చేయాలని కోరారు.

నిందితుడు అరెస్టు

గుడ్లూరు : రొయ్యల చెరువులో వినియోగించే రేడియేటర్ల, జనరేటర్లను రొయ్యల చెరువుల యజ మానులకు అద్దెకు ఇచ్చినట్లే ఇచ్చి రాత్రికి రాత్రి చోరీ చేసి మరొకరికి లీజులకు ఇచ్చి మోసం చేస్తున్న జిల్లాలోని కోవూరుకు చెందిన గుండా మహేంద్ర బాబును గుడ్లూరు పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. మండలంలోని కర్లపాలెం ,సాలిపేటకు చెందిన కొందరు రొయ్యల చెరువుల నిర్వాహకులు ఫిర్యాదుల మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు ఆ దిశగా దర్యాప్తు చేపట్టారు. దీంతో నిందితుడు దొరికాపోయాడు. ఈ మేరకు సిఐ సుబ్బారావు వివరాలను మీడియాకు వెల్లడించారు.

అర్హులకు న్యాయం చేయాలి : టిడిపి

పొదలకూరు : మండలంలో గత కొన్నేళ్లుగా పేద రైతులు సాగుచేసు కుంటున్న అసైన్మెంట్ భూములకు పట్టాల పంపిణీలో అర్హులకు న్యాయం చేయాలని పారదర్శకంగా అసైన్మెంట్ భూముల పంపిణీ జరగాలని టిడిపి మండల అధ్యక్షులు తలచీరు మస్తాన్ బాబు, పట్టణ అధ్యక్షుడు బొద్దులూరు మల్లిఖార్జున నాయుడు పేర్కొన్నారు. సోమవారం స్థానిక తహాశీల్దార్ కార్యాలయంలో తహాశీల్దార్ వీర వసంతరావుకు వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర రైతు ఆర్గనైజింగ్ సెక్రటరీ కోడూరు పెంచల భాస్కర్ రెడ్డి, పార్లమెంట్ రైతు ఆర్గనైజింగ్ సెక్రటరీ కోవూరు వెంకటేశ్వర్లు నాయుడు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

పొదలకూరు : మోటర్ బైక్, ఆర్‌టిసి బస్సు ఢీకొన్న ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ప్రమాదం పొదలకూరు పంచాయతీ పరిధిలోని చిట్టపల్లి గ్రామ క్రాస్ రోడ్డు వద్ద చోటు చేసుకుంది. పొదలకూరు రోడ్డు మార్గంలో వస్తున్న మోటార్ బైక్ కలువాయి వెళ్తున్న ఆర్‌టిసి బస్సును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న దేవకుమార్ తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం క్షతగాత్రుడిని పొదలకూరు ప్రభుత్వం వైద్యశాలకు తరలించారు.

'స్పందన' అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

నెల్లూరు : జగనన్నకు చెబుదాం (స్పందన) అర్జీలపై ప్రత్యేక దష్టి సారించి, సత్వరమే పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ రోణంకి కూర్మనాథ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ తిక్కన ప్రాంగణంలో డిఆర్‌ఓ వెంకటనారాయణమ్మ, డిఆర్డీఎ పీడీ శ్రీ సాంబ శివారెడ్డి, జడ్పీ సిఇఒ శ్రీ చిరంజీవితో కలిసి జగనన్నకు చెబుదాం (స్పందన) కార్యక్రమం నిర్వహించి వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుంచి వినతి పత్రాలను జేసీ స్వీకరించారు. వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ కార్యాలయంలో.. నగర పాలక సంస్థ పరిధిలోని జగనన్నకు చెబుదాం, స్పందన ఫిర్యాదులను కమిషనర్ వికాస్ మర్మత్ వివిధ విభాగాల అధికారులతో కలిసి నేరుగా సోమవారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. స్థానిక 28/2 న్యూ మిలటరీ కాలనీ సచివాలయాన్ని సందర్శించి ఇన్స్పెక్షన్ రిజిష్టరు, నోటీసు బోర్డు, హాజరు రిజిస్టరు, రికార్డులను పరిశీలించారు.

ఎస్‌పి కార్యాలయంలో..స్థానిక ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక 'స్పందన' కార్యక్రమంలో 108 ఫిర్యాదులు స్వీకరించినట్లు ఎస్‌పి డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి తెలిపారు. సోమవారం స్పందన కార్యక్రమం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. మహిళలు, గర్భిణీ స్త్రీలు, చిన్న పిల్లలు, దివ్యాంగుల ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలి సిబ్బందికి సూచించామన్నారు. ఎంతో బాధతో పోలీసు స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారులతో సిబ్బంది అమర్యాదగా ప్రవర్తిస్తే సహించేదిలేదని, సహనంతో వారి సమస్యలను విని, అర్థం చేసుకొని సత్వర చర్యలు తీసుకోవాలని సూచించామన్నారు. అడిషనల్ యస్.పి.(క్రైమ్స్), డిటిసి డిఎస్‌పి, ఏఆర్ డిఎస్‌పి, ఎస్‌బి సిఐ ఉన్నారు.

సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌కు అభినందనలు

ప్రజాశక్తి -కందుకూరు : కందుకూరు నూతన సిఐగా షేక్ నఫీజ్ బాషా బాధ్యతలను స్వీకరించారు. ఆయన్ను పట్టణ వైసిపి నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. సిఐ మాట్లాడుతూ కందుకూరు పట్టణ ప్రజలతో మమేకమై శాంతి భద్రతలకు భంగం కలిగించే వారిపై చట్టపరమైన చర్యలను తీసుకుం టామని తెలిపారు. పట్టణ వైసిపి నాయకులు ఎస్.కె రఫీ, యువ నాయకులు రహీం, నగల్ల నారయ్య, మైనారిటీ నాయకులు షేక్ మస్తాన్ వలి, బాబు, ముస్లిం వెల్ఫేర్ అధ్యక్షులు కరీముల్లా ఉన్నారు. ఎంఎల్‌ఎ మానుగుంట మహీధర్ రెడ్డిని నూతనంగా సిఐ నఫీజ్ బాషా సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు.

పరిహారం కోసం ఎదురుచూపులు..!

తోటపల్లిగూడూరు :పాఠశాల భవన నిర్మాణం పనుల్లో జరిగిన ప్రమాదంలో కొందరు కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. ఆస్పత్రిలో చికిత్స పొందు తున్నారు. వారంతా పరిహారం కో సం ఎదురు చూస్తున్నారు. మం డలంలోని కోడూరు పంచాయతీ చెన్నప ల్లిపాలెంలో నూతన పాఠశాల భవన నిర్మాణం పనుల కోసం పోట్లపూడి గ్రామానికి చెందిన నావూరు శీనయ్య, సూరిపాక కష్ణయ్య, జనార్దన్, హరి తది తరులు కూలి పనులకు ప్రతి రోజు వెళ్తుండేవారు. ఈ క్రమం లో ఈ నెల 5వ తేదీన భవనం రెండో అంతస్తుపై నుంచి కింద పడిపోయారు. సారవ పటిష్టం గా లేకపోవడం వల్లనే ఈ ప్ర మాదం జరిగిందని బా ధితులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.కేసు నమోదు చేయ కుండా స్థానిక వైసిపి నాయకులు పోలీసులపై వత్తిడి తెస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. సంబంధించిన శాఖల అధికారులు చొరవ తీసుకుని తమను ఆదుకోవాలని బాధితులు విజ్ఞప్తి చేస్తున్నారు.

'సోమిరెడ్డి' పరామర్శ

వెంకటాచలం :గ్రావెల్ గుంటలో పడి మృతిచెందిన బాలుడి కుటుంబాన్ని మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి సోమవారం పరామర్శించారు. వెంకటాచలం మండలం అనికేపల్లి పంచాయతీ గొలగమూడిలోని హిమాయితుల్లా ఇంటికి చేరుకొని బాలుడి మత దేహానికి నివాళులర్పించారు. హిమాయితుల్లా తండ్రి మౌలాలితోపాటు కుటుంబ సభ్యులను పరామర్శించారు. తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఏడేళ్ల బాలుడు గ్రావెల్ గుంటలో పడి మృతిచెందడం బాధాకరమని తెలిపారు. ఆ కుటుంబానికి అండగా ఉంటామన్నారు .టిడిపి మండల అధ్యక్షులు గుమ్మడి రాజా యాదవ్ ఉన్నారు.

వలంటీర్లకు పవన్ క్షమాపణ చెప్పాలి

సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షులు'మాళెం'

ప్రజాశక్తి -నెల్లూరు ప్రతినిధి :జనసేన నేత పవన్ కళ్యాణ్ నోరు అదుపులో పెట్టుకో.. లేదంటే రాష్ట్ర వలంటరీల ఆగ్రహానికి గురవుతావని రాష్ట్ర వైసీపీ సేవాదళ్ అధ్యక్షులు మాళెం సుధీర్ కుమార్ రెడ్డి తీవ్రంగా మండిపడ్డారు. సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. వాలంటీర్లను కించపరిచే విధంగా మాట్లాడిన సినిమా హీరో పీకే మర్యాదగా వాలంటీర్లకు క్షమాపణ చెప్పి తన గొప్పదనాన్ని నిరూపిం చుకోవాలన్నారు. వలంటీర్లను విమర్శించే నైతిక హక్కు పవన్ కళ్యాణ్‌కు లేదన్నారు.

మాళెం సుధీర్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి-కందుకూరు : కందుకూరు నియోజకవర్గం, ఉలవపాడు మండలం పోలీస్టేషన్‌లో మండల వలంటీర్లు ఆదివారం పవన్‌పై ఫిర్యాదు చేశారు. గ్రామ వలంటీర్లు మహిళలు అక్రమ రవాణాకు పాల్పడు తున్నారని, వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన పవన్ కళ్యాణ్ పై చర్యలు తీసుకోవాలని ఎస్ఐకి ఫిర్యాదు చేశారు.

కందుకూరులో...రాష్ట్రంలో గత నాలుగేళ్లుగా ప్రజలకు సేవలందిస్తున్న వలంటీర్లపై జనసేన అధినేత పవన్ కళ్యాణ్ వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం బాధాకరమని, పవన్‌పై చర్యలు తీసుకోవాలని కందుకరు పోలీస్టేషన్‌లో వలంటీర్లు ఫిర్యాదు చేశారు.

తోటపల్లిగూడూరు: వాలంటీర్లపై జనసేన నేత చేసిన వ్యాఖ్యలు గర్హనీయమని వైసిపి జిల్లా అధికార ప్రతినిధి తలమంచి సురేంద్ర బాబు పేర్కొన్నారు. వలంటీర్లపై పవన్ విమర్శలను సోమవారం ఆయన ఖండించారు.

ఆహార ప్యాకెట్లు పంపిణీ

ప్రజాశక్తి -కందుకూరు :జీవనజ్యోతి దివ్యాంగ వికాస సేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక విప్పగుంట రోడ్డులో పూరి గుడిసెలలో నివసిస్తున్న పేదలకు పులిహోర ప్యాకెట్లు సోమవారం పంపిణీ చేయడం జరిగింది.ఆసేవా సమితి కార్యదర్శి శీలం వెంకటేష్ మాట్లాడుతూ దాతల సహకారంతో పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు.అధ్యక్షుడు చనమాల శ్రీనివాసరావు, విశ్వ, మైత్రేశ్, నితీష్ పాల్గొన్నారు.

సిపిఐ ఆధ్వర్యంలో బస్సు యాత్ర

నెల్లూరు :సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ నాయకత్వంలో ఆగష్టు 16 నుంచి సెప్టెంబరు 6వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా 26 జిల్లాల్లో బస్సుయాత్ర నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జగదీష్ పేర్కొన్నారు. సోమవారం నగరంలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్రాన్ని రక్షించండి.. దేశాన్ని కాపాడండి అన్న నినాదంతో ఈ ప్రచారం చేస్తున్నామన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య మాట్లాడుతూ సిపిఐ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నిర్వహిస్తున్న బస్సుయాత్రను జయప్రదం చేసేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపు నిచ్చారు. సిపిఐ కార్యవర్గ సభ్యులు సిరాజ్, అరిగెల నాగేంద్రసాయి ఉన్నారు.

చెరువులు దెబ్బతీసి, మట్టి అమ్ముతున్నారు..

రైతులను అవమానించడం సరికాదు -టిడిపి నేత సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి
జిల్లాలో చెరువులను దెబ్బతీసి, మట్టి అమ్ముకొని వైసిపి నేతలు బతుకుతున్నారని, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి విమర్శించారు. సోమవారం కలెక్టరేట్‌లోని స్పందనలో జెసి కూర్మనాథ్‌కు వినతి పత్రం సమర్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మట్టిని అమ్ముకునే స్థాయికి దిగజారిపోయారన్నారు. కనుపూరు చెరువును కాపాడుకోవడం కోసం ఎందాకైనా సిద్ధంగా ఉన్నామన్నారు. రైతులను అవమానించే హక్కు కలెక్టర్‌కు ఎవరిచ్చారని..ఆయనకు ప్రత్యేక చట్టాలు లేవని తెలుసుకోవాలన్నారు. కనుపూరు చెరువులో రైతుల పేరుతో మట్టి తవ్వకాలను అనుమతులు తీసుకుని లేఅవుట్లకు తోలుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. స్పందనలో ఫిర్యాదు చేసేందుకు వచ్చిన రైతులను అవమానించడం కలెక్టర్‌కు తగదన్నారు.కాకాణి దెబ్బకు సర్వేపల్లి నియోజకవర్గంలోని చెరువులు సర్వనాశనమైపోతున్నాయన్నారు. కోడూరు చెరువు నుంచి కనుపూరు చెరువు వరకు దేనినీ వదలకుండా మట్టి, గ్రావెల్ తవ్వేసి నామరూపాల్లేకుండా చేశారన్నారు. బ్రిటీష్ పాలకులు నిర్మించిన కనుపూరు చెరువులో ఒకసారి 10 వేల క్యూబిక్ మీటర్ల మట్టి తవ్వకానికి అనుమతిచ్చారన్నారు. మరోసారి 20 వేలకు ఇచ్చారని, ఇప్పుడు మళ్లీ 70 వేల క్యూబిక్ మీటర్ల మట్టి తవ్వకానికి పర్మిషన్లు ఇచ్చారన్నారు. పేరుకు లక్ష క్యూబిక్ మీటర్లకు అనుమతులు తెచ్చి 15 లక్షల క్యూబిక్ మీటర్లకు పైగా మట్టిని తవ్వి అమ్మేసుకుంటు న్నారన్నారు. రైతుల పొలాలు మెరక చేసుకోవడానికి సంబంధించిన జీఓ నెం 2026ను దుర్వినియోగం చేస్తూ క్యూబిక్ మీటర్ రూ.1 మాత్రమే చెల్లిస్తూ మట్టిని ప్రయివేటు లేఅవుట్లకు తోలుకుంటున్నారన్నారు. లేవుట్లకు మట్టిని తరలిస్తే నిబంధనల ప్రకారం ప్రభుత్వానికి క్యూబిక్ మీటర్‌కు రూ.231 చెల్లించాలని, కానీ రూ.1 మాత్రమే చెల్లించి మిగిలిన మొత్తమంతా కాకాణి ఖజానాకు జమ చేసుకుంటున్నారన్నారు.

గ్రీవెన్స్‌లో జెసి కూర్మనాథ్‌కు వినతి పత్రం అందజేస్తున్న సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

తోడేరు చెరువులో మట్టి తవ్వకాలు జరిపి ఆరుగురు యువకులను బలిగొన్నారని, వెంకటాచలం మండలంలోని చాకలి చెరువులో పడి ఏడేళ్ల చిన్నారి ప్రాణాలు కోల్పోవడం బాధాకరమన్నారు. వైసీపీ నేతల ధనదాహం కోసం చెరువుల విషయంలో సుప్రీం కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను తుంగలో తొక్కేస్తున్నారన్నారు.

అంగన్‌వాడీలకు వేతనాలు పెంచాలి

గుడ్లూరు: ఐసిడిఎస్ ఉలవపాడు ప్రాజెక్టు పరిధిలోని అంగన్ వాడీలు, ఆయాలకు వేతనాలు అందకపోవడంతో గౌరవ వేతనం కోసం అంగన్‌వాడీ కార్యకర్తలు ఎదురుచూపు చూస్తున్నారు. గత మూడు నెలలుగా జీతాలు చెల్లిం చకపోవడంతో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు ఇబ్బందులు పడుతున్నారు. పెరిగిన నిత్యావసర వస్తువులు ధరలకు అనుగుణంగా జీతాలు పెంచాలని ఉలవపాడు ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి-వలేటివారిపాలెం : ఉరి వేసుకొని వ్యక్తి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని కాకుటూరు బస్టాండ్ వద్ద ఆదివారం రాత్రి జరిగింది. బీహార్ రాష్ట్రానికి చెందిన విక్రమ్‌కుమార్ రామ్ (20), భార్యాభర్తల మధ్య మనస్పర్ధల నేపథ్యంలో క్షణికావేశంలో ఈ ఘాతుకానికి పాల్పడ్డాడు. మృతుడి అన్న అశోక్‌కుమార్ రామ్ వివిపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అందిన ఫిర్యాదు మేరకు వలేటివారిపాలెం ఎస్ఐ మహేంద్ర నాయక్ సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని సిఐ సుబ్బారావు, ఎస్ఐ పరిశీలించారు. మృతుడి కుటుంబం జాతీయ రహదారి పనుల చేసే నిమిత్తం ఇక్కడకు వచ్చినట్లు తెలిపారు.

అంగన్‌వాడీలకు వేతనాలు పెంచాలి

ప్రజాశక్తి-విడవలూరు : అంగనవాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్‌కు రాష్ట్ర ప్రభుత్వం వేతనాలు పెంచాలని గతంలో సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యూటీ ఇవ్వాలని సోమవారం విడవలూరు మండల అంగన్‌వాడీ టీచర్లు అండ్ హెల్పర్లు అధిక సంఖ్యలో జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించేందుకు బయల్దేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పక్క రాష్ట్రం తెలంగాణలో జీతాలు ఇచ్చినట్లు ఆంధ్రప్రదేశ్లో కూడా జీతాలు పెంచి ఇవ్వాలని అధికారులకు విన్నవించుకున్నారు. కార్యక్రమంలో సిఐటియు, సిపిఐ, సిపిఎం నాయకులు వారికి మద్దతు తెలిపారు.

పండ్ల మొక్కలు పెంపకం

ప్రజాశకి-ఉదయగిరి : పాఠశాల ఆవరణంలో ఎంఇఒ-2 తోటా శ్రీనివాసరావు ఫడ్స్ డైరెక్టర్ పివి రమణయ్య పండ్ల మొక్కలను నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. సోమవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయ ఆవరణంలో ఎంపిపి స్కూల్ హెచ్‌డబ్ల్యూలో ఎంఇఒ ఫడ్స్ డైరెక్టర్ పివి రమణయ్య పండ్ల మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఫడ్స్ స్వచ్ఛంద సేవాసంస్థ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జిఒ విద్య బోర్డు సహకారంతో వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతిని తిరస్కరించుకొని ఈ చెట్లు నాటే కార్యక్రమం చేపట్టామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సయ్యద్ ఖలీమ్, ఎం.రామకృష్ణారెడ్డి, బి.నరసింహులు, అంగన్‌వాడీ టీచర్ సంజీవరాణి, మిడ్డే మీల్స్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పవన్ దిష్టిబొమ్మ దగ్ధం

ప్రజాశక్తి-బిట్రగుంట : పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని బోగోలు మండల విశ్వనాథరావుపేట సచివాలయంలో వాలంటరీలు కిషోర్, పెండ్లి శ్రీను వ్యాఖ్యానించారు. పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలకు నిరసనగా బోగోలు మండలంలోని పనిచేస్తున్న వాలంటరీలు సోమవారం బోగోలు బజార్ సెంటర్లో నిరసన తెలిపారు.పవన్ కళ్యాణ్ బొమ్మలు దగ్ధం చేశారు. సచివాలయాల వాలంటరీలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-కొడవలూరు : రాజకీయ లబ్ధి కోసమే సంక్షేమ వారధులైన వలంటీర్‌లపై విమర్శలు చేయడమేమిటంటూ పవన్ కుమార్‌పై ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి మండిపడ్డారు. మండలంలోని కొత్త వంగల్లు మజరా శ్రీనివాసపురంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వేతనం ఆశించకుండా ప్రభుత్వ పాలసీలతో ఎంతో కష్టపడి సేవలందిస్తున్న పరిస్థితిలో వలంటీర్లపై పవన్ కళ్యాణ్ రాజకీయ ప్రయోజనాల కోసం విమర్శించడాన్ని తప్పు బట్టారు. సమావేశంలో వైసిపి మండల కన్వీనర్ గంధం వెంకట శేషయ్య, ఎంపిపి జి.జ్యోతి, సర్పంచ్ ఎం. సింధు, ఉప సర్పంచ్ చక్కా శైలజ, ఎంపిటిసి ఎన్ ప్రసాద్, నాయకులు చక్కా మహేశ్ బాబు పాల్గొన్నారు.

భోజన పొట్లాలు పంపిణీ

ప్రజాశక్తి-కావలి : కావలి ఆర్‌డిఒ వికె శీనానాయక్ పిలుపు మేరకు స్పందన అర్జీదారులకు భోజనం, మజ్జిగ, మంచినీటి సీసాలు అందిస్తున్నట్లు రెడ్‌క్రాస్ జీవిత సభ్యులు, ప్రముఖ కలప వ్యాపారులు సోమిశెట్టి సుజన, కిషోర్ దంపతులు తెలిపారు. సోమవారం ఆర్‌డిఒ కార్యాలయంలో జరిగిన స్పందన కార్యక్రమంకు వచ్చిన అర్జీదారులకు రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో మజ్జిగ, భోజనపొట్లాలు, మంచినీటి సీసాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ఆర్థిక సహకారం అందించిన సుజన కిషోర్ దంపతులు మాట్లాడుతూ దూరప్రాంతాల నుండి తమ సమస్యల పరిష్కారానికి వచ్చే అర్జీదారులు, ఆందోళనకారులకు ఆకలి తీర్చడం సంతృప్తిని ఇచ్చిందన్నారు. కార్యక్రమం కొనసాగింపునకు తమవంతు సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ బాధ్యులు హరినారాయణరెడ్డి, బివిఎస్ ప్రసాద్, రెడ్‌క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

సర్టిఫికెట్ మంజూరు చేయాలని వినతి

ప్రజాశక్తి-ఉదయగిరి : ఎస్‌సి సామాజిక వర్గానికి సంబంధించిన క్యాస్ట్ సర్టిఫికెట్ మంజూరు చేయాలని ముచ్చు కులం మహిళలు తహశీల్దార్ జగదీష్ బాబుకు వినతి పత్రం అందజేశారు. సోమవారం స్పందన కార్యక్రమంలో యూనియన్ రోడ్డు సమీపంలోని ముచ్చు కులంకు చెందిన మహిళలు తమ పిల్లల చదువులు ప్రభుత్వ పథకాలకు క్యాస్ట్ సర్టిఫికెట్ ఇవ్వకపోవడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో తహశీల్దార్ పర్మినెంట్ క్యాస్ట్ సర్టిఫికెట్లు మంజూరు చేశారని ప్రస్తుతం వాటి కాల పరిమితి నాలుగు సంవత్సరాలు అని ప్రస్తుతం సచివాలయాల్లో క్యాస్ట్ సర్టిఫికేట్ మంజూరు చేయడం లేదని, దాంతో పిల్లల చదువులకు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర నాయకులు బకీరు, జాషువా, మహిళలు పాల్గొన్నారు.

సచివాలయంలో ఎంపిడిఒ తనిఖీలు

ప్రజాశక్తి-బిట్రగుంట : బోగోలు మండలం తాళ్లూరు సచివాలయాన్ని సోమవారం ఎంపిడిఒ వెంకటసుబ్బయ్య ఆకస్మిక తనిఖీ చేసి జగనన్న సురక్ష కార్యక్రమంపై సచివాలయ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష పథకంలో ప్రజలకు అవసరమైన సర్టిఫికెట్లను ప్రభుత్వం ఉచితంగా వాలంటీర్ల ద్వారా వారి ఇంటికే అందజేసే నిమిత్త కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారని ఈ అవకాశాన్ని మండలంలోని ప్రజలు వాలంటీర్ల ద్వారా పొందాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో తాళ్లూరు సచివాలయ సిబ్బంది తదితరులున్నారు.

అధికారులకు సూచనలిస్తున్న ఎంఎల్ఎ విక్రమ్‌రెడ్డి

ఎంజిఆర్ స్మృతివనం ఏర్పాటుకు ప్రణాళికలు

ప్రజాశక్తి-మర్రిపాడు : మాజీమంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి పేరుతో వారి కుటుంబసభ్యుల స్వంత నిధులతో ఏర్పాటు చేయనున్న ఎంజిఆర్ మెమోరియల్ స్మృతివనం ఏర్పాట్లపై సోమవారం బ్రాహ్మణపల్లిలోని వారి నివాసంలో మాజీ ఎంపి మేకపాటి రాజమోహన్ రెడ్డి, ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్ రెడ్డి, ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్ రెడ్డిలు ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షించారు. 14 ఎకరాలు ఉండగా 3 ఎకరాల్లో ఎంజిఆర్ స్మృతివనం ఏర్పాటుతో పాటు మిగిలిన 11 ఎకరాల్లో పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు సుమారు రూ.5కోట్ల మేర నిధులు వెచ్చించనున్నారు. ఈ మేరకు ఆ ప్రాంతంలో ఏర్పాటు చేయనున్న పర్యాటకాభివృద్ధికి సంబంధించి, ఎంజిఆర్ స్మృతివనానికి సంబంధించి డిజైన్లు పరిశీలించి తగు సూచనలిచ్చారు. మాజీమంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి పేరుపై ఏర్పాటు చేయనున్న స్మృతివనంతో పాటు మిగిలిన ప్రాంతంలో పర్యాటకంగా అభివృద్ధి చేయడంతో పాటు మేకపాటి గౌతమ్‌రెడ్డి అగ్రికల్చర్ యూనివర్శిటీకి సంబంధించిన విద్యార్థులకు ఉపయోగపడే విధంగా అక్కడ అవసరమైన అన్ని మౌలిక సదుపాయాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. త్వరలోనే పనులు మొదలుపెట్టి వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రాజులు, నవాబులు పాలించిన ఉదయగిరి దుర్గంతో పాటు మేకపాటి గౌతమ్‌రెడ్డి స్మృతివనం, అగ్రికల్చర్ యూనివర్శిటీలు సైతం భవిష్యత్తులో అందరూ సందర్శించే విధంగా సిద్ధం చేయనున్నట్లు వివరించారు.

'యువగళం'తో జగన్‌కు భయం

మాట్లాడుతున్న నారా లోకేష్

హాజరైన జనం

ప్రజాశక్తి-కావలి

యువగళం కావలిలో జన ప్రభంజన మని, ఈ యువగళం పాదయాత్రతో సిఎం జగన్‌కు భయం పట్టుకుందని మాజీ మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. సోమవారం కావలి పట్టణంలో జరిగిన "యువగళం" పాదయాత్రలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక బి.పి.ఎస్. సెంటర్‌లో జరిగిన భారీ బహిరంగ సభలో నారా లోకేష్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. జాతీయ క్రీడలకు తగిన నిధులు అందించలేని ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికి ఐపిఎల్ టీం కావాలంటా అని ఎద్దేవా చేశారు. ఇటీవల జగన్ ప్రత్యేక విమానంలో ఢిల్లీకి వెళ్లి తన బాబాయి హత్యకేసును దారి మళ్లిస్తున్నాడని విమర్శించారు. జగన్ సిఎం అయ్యాక 9సార్లు కరెంట్ ఛార్జీలు, 3సార్లు ఆర్‌టిసి ఛార్జీలు, పెట్రోల్, డిజిల్ వందసార్లు పెంచారన్నారు. ఇక టమోటా లు, పచ్చి మిర్చి, చిక్కుడుకాయలు సెంచరీ దాటాయన్నారు. ఆయన హయాంలో దాదాపు 100 సంక్షేమ పథకాలు రద్దు చేశాడన్నారు. రాష్ట్రంలో బిసిల కోసం దామాషా ప్రకారం నిధులు అందజేస్తామన్నారు. కార్పొరేషన్‌లను బలోపేతం చేస్తామన్నారు. వారి కోసం బిసి రక్షణ చట్టం తెస్తామన్నారు. మైనారిటీల కోసం ఇస్లామిక్ బ్యాంకు ఏర్పాటు చేస్తామన్నారు. ఉద్యోగులకు సిపిఎస్ రద్దు చేస్తామన్నారు. అందుచేత రాష్ట్రంలో సైకో పాలనకు చరమగీతం పాడాలన్నారు. నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా టిడిపి ప్రభుత్వాన్ని గెలిపించాలన్నారు. కార్యక్రమంలో టిడిపి కావలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి మాలేపాటి సుబ్బానాయుడు, కావ్య కృష్ణారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ దగుమాటి వెంకటకృష్ణారెడ్డి, మాజీ మంత్రులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, పరసా రత్నయ్య, మాజీ ఎంఎల్ఎ కంభం విజయరామిరెడ్డి, ఉదయగిరి ఎంఎల్ఎ మేకపాటి రాజమోహన్ రెడ్డి, మలిశెట్టి విజయలక్ష్మి, గుంటుపల్లి శ్రీదేవి చౌదరి, తదితరులు పాల్గొన్నారు.

కావలి కనక పట్టణమా.. అవినీతి పట్టణమా..!

యువగళం సభలో కావలి ఎంఎల్ఎ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి గురించి నారా లోకేష్ మాట్లాడుతూ కావలి అనకొండగా మారిన రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి, తన ప్రతాపాన్ని "అభివృద్ధి పనులపై చూపకుండా" అవినీతిపై చూపితే కావలి "కనక పట్టణం"గా ఎలా అవుతుందని ప్రశ్నించారు. ఆయనొక "అవినీతి అనకొండ" అని చెప్పారు. ఆయన ల్యాండ్, సాండ్, వైన్, మైన్ రంగాలలో అయన అవినీతి చేసి, వేల కోట్లు సంపాదించాడని అన్నారు. ఆయనతో పాటు ఆయన అనుచరులు మురళి రెడ్డి బోగోలు బీసీ హాస్టల్‌కి చెందిన 4ఎకరాల కోట్ల విలువైన భూమిని కాజేశాడన్నారు.సెంట్ స్థలాల పంపిణీలో అయన అనుచరులు యాదగిరి, సుకుమార్ రెడ్డి, సుబ్బారావు, రవికుమార్, శివకుమార్ రెడ్డి, జగదీషరెడ్డిలతో కలిసి, ఒక ఎకరాను రూ.15లక్షలు పెట్టి కొని, రూ.50లక్షలు చొప్పున ప్రభుత్వానికి అమ్మి, వేలాది కోట్లు గడించారాని ఆరోపించారు. భూములకు రేట్ లు కట్టే సందర్భంగా సహకరించలేదని ఈ అవినీతి అనకొండ జిల్లా కలెక్టర్‌నే బదిలీ చేయించడానికి గుర్తు చేశారు. పాదయాత్రలో తన వద్దకు వచ్చిన 70 మంది లాయర్లతో ముచ్చటించారు.

'యువగళం'కు పోటాపోటీగా ఫ్లెక్సీలు

ప్రజాశక్తి-జలదంకి

మండలంలో మంగళవారం జరగనన్న యువగళం పాదయాత్రకు టిడిపి నేతలు పోటాపోటీగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. రామవరపాడు, చోడవరం రహదారుల పరిధిలో నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి మాజీ ఎంఎల్ఎ బొల్లినేని వెంకటరామారావు, కాకర్ల సురేష్ వర్గీయులు యువనేత నారా లోకేష్‌కు స్వాగతం తెలుపుతూ ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. ఇరు వర్గాల వారు కూడా ఎవరికి వారే యువగళాన్ని విజయవంతం చేసేందుకు తమ అనుచరుల ద్వారా వాహనాలను ఎక్కడికక్కడ సిద్ధం చేశారు. టిడిపి పులుగుంట మధుమోహన్ రెడ్డి, పూనూరు భాస్కర రెడ్డి, వంటేరు జయ చంద్రారెడ్డి, పచ్చ పెంచల నాయుడు, ఉన్నాం రవి నాయుడు, తదితరులు ఆధ్వర్యంలో బుల్లినేని వెంకట రామారావు ఆదేశాలతో పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఇటీవల యువగళంను సమర్థవంతంగా విజయవంతం చేసేందుకు జలదంకిలో సమావేశం నిర్వహించారు. గంటా అశోక్, తమ్మినేని మధుసూదన్ రావు, కొల్లా రాధాకృష్ణ, కాసు చెంచు నాయుడు, అంబటి హరిప్రసాద్ నాయుడు, మద్దూరి శ్రీనివాసులరెడ్డి, మాజీ ఎంపిటిసి మోదేపల్లి మాలకొండయ్య, కాకర్ల సురేష్ తరపున లోకేష్ యవగళం పాదయాత్రను విజయవంతం చేసేందుకు ఫ్లెక్సీల ఏర్పాటుతో పాటు, జన సమీకరణకు సిద్ధమయ్యారు. అటు కాకర్ల సురేష్ ఇటు బొల్లినేని వెంకట రామారావులు ఎవరికి వారు యువగళంపై ప్రత్యేక శ్రద్ధను తీసుకున్నారు.

తుమ్మలపెంట నుంచి 'యువగళం' ప్రారంభం

ప్రజాశక్తి-కావలిరూరల్

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ బాబు ప్రారంభించిన యువగళం పాదయాత్ర కావలి మండలంలోని తుమ్మల పెంట మత్స్యకార గ్రామం నుండి టిడిపి కావలి నియోజకవర్గం ఇన్‌ఛార్జి మాలేపాటి సుబ్బానాయుడు ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభమైంది. ముందుగా నారా లోకేష్ బాబు యువగళం పాదయాత్రకు మత్స్యకార గ్రామంలో మత్స్యకారులు భారీ గజమాలతో మంగళ వాయిద్యాలు, బ్యాండ్ బజ, మోత మోగిస్తూ యువగళం పాదయాత్రను ఘనంగా ప్రారంభించారు. లోకేష్ బాబును కలిసేందుకు మత్స్యకారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం తుమ్మలపెంట జంక్షన్‌లో మత్స్యకారులతో లోకేష్ బాబు ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరిస్తూ వారితో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం లోకేష్ బాబు మాట్లాడుతూ తాను మంత్రిగా ఉన్నప్పుడు తుమ్మల పెంటకు ఒకసారి వచ్చినట్లు ఇక్కడి గురుకుల పాఠశాలకు నిధులు కేటాయించి పలు అభివృద్ధి కార్యక్రమాలు చేసినట్లు తెలిపారు. మళ్లీ యువగళంతో రెండవసారి తుమ్మల పంటకు వచ్చినట్లు తెలిపారు. అనంతరం మన్నంగిదిన్నే స్థానిక ప్రజలు లోకేష్ బాబును చూసేందుకు రోడ్లపైకి భారీగా చేరుకున్నారు. రోడ్డుపై వస్తున్న లోకేష్ బాబును చూసిన ప్రజలు ఆనందంతో ఆయనతో సెల్ఫీలు దిగేందుకు పోటీపడ్డారు. కొనదిన్నె ఆముదాలదిన్నె వరకు అడుగడుగునా మహిళలు హారతులతో స్వాగతం పలికారు. మత్స్యకారులు, ప్రజలు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని సైకో పోవాలి సైకిల్ రావాలి అనే నినాదాలతో రోడ్డు పొడవున నినాదాలతో హోరెత్తించారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర, కావలి నియోజకవర్గం ఇన్‌ఛార్జి మాలేపాటి సుబ్బానాయుడు, కావ్య చారిటబుల్ ట్రస్ట్ అధినేత కావ్య కృష్ణారెడ్డి, రూరల్ మండల అధ్యక్షుడు ఆవుల రామకృష్ణ, నాయకులు, కార్యకర్తలు, మత్స్యకారులు, ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ప్రజలకు అభివాదం చేస్తున్న నారా లోకేష్

లోకేష్‌ను కలిసిన కొనదిన్నె గ్రామస్తులు

ప్రజాశక్తి-కావలి రూరల్

కావలి మండలంలోని కొనదిన్నె గ్రామస్తులు తమ సమస్యలను తెలియజేసేందుకు యువనేత లోకేష్ బాబును కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో 200 కుటుంబాలు నివసిస్తున్నాయని తెలిపారు. తాగునీటి పైపులైన్లు నిత్యం రిపేర్లు వస్తుందని, దీనివల్ల గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కొత్తపైపు లైన్లు వేయాలని కోరారు. గ్రామంలో డ్రెయినేజీలు లేకపోవడంతో మురుగునీరు రోడ్లపైకి వచ్చి దోమల బెడద అత్యధికంగా ఉందని తెలిపారు. గౌడ కులస్తులకు శ్మశానవాటిక చుట్టూ ప్రహరీగోడ, గేటు నిర్మించాలన్నారు. ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్లు అప్పు చేసి మరీ కట్టామని కానీ, ఇంతవరకు బిల్లులు రాలేదని లోకేష్ బాబుతో వారి ఆవేదనను వెల్లబుచ్చుకున్నారు. ఈ సందర్భంగా నారా లోకేష్ స్పందిస్తూ జగన్మోహన్ రెడ్డి పాలనలో గ్రామాలను పూర్తిగా నిర్లక్ష్యం చేశాడని గ్రామపంచాయతీలకు చెందిన రూ.9వేల కోట్లను సర్పంచ్‌లకు తెలియకుండా జగన్ ప్రభుత్వం దొంగిలించిందని తెలిపారు. ప్రస్తుతం పంచాయతీల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లడానికి కూడా నిధుల్లేని దుస్థితి నెలకొందన్నారు.

ప్రతిభా పురస్కారాలు అందజేత

ప్రజాశక్తి-దగదర్తి

10వ తరగతి 500 పై మార్కులు వచ్చిన విద్యార్థులకు ప్రతిభ పరిస్కారాలు భాగంగా మెడలో ప్రశ్నాపత్రాన్ని ఎంఇఒ జన విజ్ఞాన వేదిక సభ్యులు జిల్లా మహిళా సంఘం నాయకురాలు జక్కా శేషమ్మ సోమవారం అవార్డులను అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో ఏడు పాఠశాల సంబంధించి మొత్తం 500 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. వాటిలోఐదు ప్రభుత్వ పాఠశాలలో రెండు ప్రైవేటు పాఠశాలలు సంబంధించి మొదటి ,ద్వితీయ, తృతీయ బహుమతుల కింద 21 మంది విద్యార్థులను ఎంపిక చేయడం జరిగిందని తెలిపారు.కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక సభ్యులు పోతంశెట్టి విద్యాచరణ్, వంశీ చరణ్, మాదాల రాము, కర్ర పోలయ్య, వంటరు సుధాకర్, గోపుసాని రమేష్, మంద సీనయ్య, మంద మహేష్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

న్యాయం చేయండి సారూ..

ప్రజాశక్తి-ఇందుకూరుపేట : తమకు సంబంధించిన స్థలాన్ని, ఆ స్థలానికి ఆనుకుని ఉన్న ఉమ్మడి దోరువును తన సోదరుడు కబ్జా చేస్తూ ఉంటే ఇదేంటని ప్రశ్నిస్తే తమని బెదిరిస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నాడని బాధితుడు ముత్యాల వెంకట శేషయ్య వాపోయాడు. ఈ మేరకు సోమవారం తన గోడును ఇందుకూరుపేట తహశీల్దార్ సుబ్బయ్యకు విన్నవించుకున్నారు. అనంతరం శేషయ్య మీడియాతో మాట్లాడుతూ తన తమ్ముడు ముత్యాల చంద్రశేఖర్ తనకు సంబంధించిన స్థలంలో అక్రమంగా కట్టడాలు నిర్మిస్తున్నాడని, ఉమ్మడి దొరువూను ఆక్రమిస్తూ ఇదేంటని ప్రశ్నిస్తే తనని బెదిరిస్తూ భయభ్రాంతులకు చేస్తున్నాడని తెలిపారు. ఈ విషయమై పలుమార్లు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశానని, పోలీసు వారు దీన్ని పట్టించుకోలేదన్నారు. స్థానిక రెవెన్యూ అధికారి తన తమ్ముడితో కుమ్మక్కై తనకు సంబంధించిన స్థలాన్ని రీ సర్వేలో తన తమ్ముడు పేరు నమోదు చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నాడని, కావున ఉన్నతాధికారులు చొరవ తీసుకొని తనకు న్యాయం చేయాలని బాధితుడు కోరారు.

667 పొగాకు బేళ్లు కొనుగోలు

ప్రజాశక్తి-మర్రిపాడు : మండలంలోని డిసిపల్లి పొగాకు వేలం కేంద్రానికి పొంగూరు క్లస్టర్‌కు చెందిన రైతులు 688పొగాకు బేళ్లను వేలం కేంద్రానికి తీసుకురాగా వీటిలో 667బేళ్లను పలు కంపెనీలకు చెందిన వ్యాపారస్తులు కొనుగోలు చేశారనివేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. అధిక బరువుతో ఉన్న 21పొగాకు బేళ్లను వేలానికి తిరస్కరించారన్నారు.

కార్మికుల బకాయిలను చెల్లించాలి

ప్రజాశక్తి-కావలి

మున్సిపల్ కార్మికుల జీతాల బకాయిలను వారికి ఇవ్వాల్సిన వస్తువులను వెంటనే ఇవ్వాలని కోరుతూ సోమవారం ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో మున్సిపల్ ఆఫీసులో జరుగుతున్న 'స్పందన' కార్యక్రమంలో ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు పట్టణ కార్యదర్శి వై.కృష్ణమోహన్ మాట్లాడుతూ పట్టణంలో గత ఎన్నో సంవత్సరాల నుండి కార్మికులు పట్టణంలో పారిశుధ్య పనులు చేస్తున్నారని, వీరికి ఇప్పటికీ రెండు నెలల హెల్త్ అలవెన్స్, డైలీ కార్మికులకు మూడు నెలలు జీతాలు ఇవ్వాల్సి ఉందన్నారు. జీతాలు రాకపోవడంతో కార్మికులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులు మాత్రం జీతాలు ఇవ్వడంలో విఫలమవుతున్నారని ఆరోపించారు. అంతే కాకుండా కార్మికులకు యూనిఫారం, సబ్బులు, కొబ్బరి నూనెలు, బూట్లు, చీపుర్లు, పారలు, మాస్కులు, గ్లౌజులు ఇవ్వాల్సి ఉన్నప్పటికీ ఇవ్వడం లేదన్నారు. దీనివల్ల కార్మికులు పనులలో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ముఖ్యంగా పుష్కార్టు చక్రాలు విరిగిపోతే బాగుచేయించాల్సిన అధికారులు రిపేర్లు చేయించకుండా ఉండడంతో కార్మికులే డబ్బులు పెట్టుకొని చక్రాలు బిగించుకొని రిపేర్లు చేయించుకుంటున్నారని తెలిపారు. ఇది చాలా అన్యాయమని అధికారులు ఇప్పటికైనా స్పందించి వారికి రావాల్సిన జీత బకాయిలను, అలాగే పనిముట్లు వస్తువులు ఇతర సామాన్లను వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు పి.పెంచల నరసింహం, యూనియన్ నాయకులు తురక శీనయ్య, బిరదల మహేష్, ఒంగోలు రమేష్, పరుసు జేమ్స్, శెట్టిపల్లి బాబు, శివకోటయ్య, త్రిమూర్తులు కార్మికులు పాల్గొన్నారు.

డిసిపల్లిలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

ప్రజాశక్తి-మర్రిపాడు

మాట్లాడుతున్న ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్‌రెడ్డి

మండలంలోని డిసిపల్లి గ్రామంలో ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్ రెడ్డి సోమవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేద ప్రజల సంక్షేమం కోసం అందచేసిన సంక్షేమ పథకాలను వారికి వివరిస్తూ ముఖ్యమంత్రి అందచేసిన సంక్షేమ పథకాల లబ్ధి కరపత్రాలను వారికి అందచేశారు. పలువురు రెవెన్యూ సమస్యలను ఎంఎల్ఎ దృష్టికి తీసుకురావడంతో 15 రోజుల వ్యవధిలో వాలంటీర్, విఆర్ఒ స్వయంగా ఇంటికి వస్తారని, సమస్యలను వారికి తెలిపితే జాబితా రూపొందించి తమకు అందజేస్తారని, వాటన్నింటిని ఉన్నతాధికారులతో చర్చించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. నియోజకవర్గంలో టిడిపి ఖాళీగా ఉందని, రానున్నది వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వమేనని, ఇలాంటి పార్టీ మారుతారని చెప్పుకుంటున్న వారికి రాజకీయంగా భవిష్యత్తు ఉండదనే విషయం వారికి కూడా తెలుసునన్నారు. 2024లో రాష్ట్ర ప్రజలంతా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే తమ సంపూర్ణ మద్దతు తెలిపేందుకు సిద్ధంగా ఉన్నారని వివరించారు. కార్యక్రమంలో నెల్లూరు డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, వైసిపి మండల అధ్యక్షులు సుబ్బిరెడ్డి, భీమవరం సొసైటీ చైర్మన్ సోమల మాధవరెడ్డి, మాజీ కన్వీనర్ గంగవరపు శ్రీనివాసులు నాయుడు, స్థానిక సర్పంచ్ రేవూరు సుప్రజ, ఎంపిటిసి దొరసానమ్మ, గోపాల్ రెడ్డి, మండల సచివాలయాల కన్వీనర్ సిద్ధంరెడ్డి మోహన్ రెడ్డి, కోనంకి శ్రీనివాసులు నాయుడు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

నేడు 'జగనన్న సురక్ష'

ప్రజాశక్తి-వరికుంటపాడు

మండలంలోని గణేశ్వరపురం పంచాయతీలో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సోమవారం ఎంపిడిఒ విజయభాస్కరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు పాల్గొంటారని తెలిపారు. అక్కడ ప్రభుత్వం అందించే ధ్రువీకరణ పత్రాలతో పాటు మిగతా అభివృద్ధి కార్యక్రమాలు సంక్షేమ పథకాలపై వివరించనున్నారు. అన్ని శాఖల అధికారులు, గ్రామస్తులు హాజరుకావాలని ఎంపిడిఒ పిలుపునిచ్చారు.

సమస్యలు స్పందనలో తెలియజేయండి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

ప్రభుత్వం ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు ప్రతి సోమవారం స్పందన అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని ఆర్‌డిఒ సాధు కరుణ కుమారి తెలియజేశారు. సోమవారం ఆత్మకూరు ఆర్‌డిఒ కార్యాల యంలో స్పందన కార్యక్రమంలో ఆమె పలువురు బాధితులు వద్ద అర్జీలు స్వీకరించారు. అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. మండల స్థాయిలో పరిష్కారం సమస్యలను డివిజన్ కార్యాలయానికి పంపించాలన్నారు. ఇప్పటికే మండల అధికారులకు సూచించినట్లు తెలిపారు. స్పందనలో 11 అర్జీలు అందినట్లు తెలియజేశారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ ఏడి జయచంద్ర సిడిపిఒ జైన కుమారి, పిహెచ్‌సి డాక్టర్ రాకేష్, ఎఒ సుభద్ర, పలు శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఇన్‌ఛార్జి తహశీల్దారుతో సమీక్ష

ప్రజాశక్తి-సంగం

స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఇన్‌ఛార్జి తహశీల్దార్ అశోక్‌తో సోమవారం కావలి కాలువ డిఇ వెంకటరమణయ్య సమావేశం నిర్వహించారు. కావలి కాలువ పరిధిలో ఉన్న అధికారిక ఆయకట్టు రైతులకు సాగునీరు అందించే విషయంపై వారితో చర్చించారు. ఐఎబి తీర్మానం ప్రకారం రబీ సీజన్లో కావలి కాలువ అధికారిక ఆయకట్టు రైతులకు పూర్తిస్థాయిలో సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. అంతేకాకుండా అనధికారికంగా మోటార్ల కింద పండించే రైతులకు కూడా నష్టం జరగకుండా సాగునీరు అందించే ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. రైతులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో జెఇలు రమణయ్య, వినయ్ పాల్గొన్నారు.

'ఆనం' జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

కేకును కట్‌చేస్తున్న టిడిపి నాయకులు

ఆనం రామనారాయణరెడ్డి అంటే అభివృద్ధికి కేరాఫ్ అని, ఆత్మకూరు నియోజకవర్గంలో ఆయన చేసిందే అభివృద్ధి అని పలువురు టిడిపి నాయకులు పేర్కొన్నారు. సోమవారం ఆనం రామనారాయణరెడ్డి 72వ జన్మదినం సందర్భంగా ఆత్మకూరు పట్టణంలో టిడిపి పార్టీ శ్రేణులు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ఆత్మకూరు నియోజకవర్గంలో ముఖ్యంగా ఆత్మకూరు పట్టణాన్ని అభివృద్ధి చేసిన ఘనత ఆనం రామనారాయణరెడ్డి ఆయన హయాంలో పాలిటెక్నికల్ కళాశాల, జిల్లా ప్రభుత్వ వైద్యశాల, గురుకుల పాఠశాల, గిరిజన సమీకృత హాస్టల్, బొగ్గేరుపై బ్రిడ్జి నిర్మాణం, మున్సిపల్ కార్యాలయం ఇలా చెప్పుకుంటూ పోతే ఆనం చేసిన అభివృద్ధి ఆత్మకూరు నియోజకవర్గంలో కనిపిస్తుందన్నారు. అలాంటి ఆనం జన్మదిన వేడుకలను ఆత్మకూరు పట్టణంలో నిర్వహించుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా భారీ కేక్ కట్ చేసి కార్యకర్తలకు, ప్రజలకు పంచిపెట్టారు. అనంతరం భారీస్థాయిలో బాణాసంచా పేల్చి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు పులిమి శైలజా రెడ్డి టిడిపి పట్టణ అధ్యక్షులు తుమ్మల చంద్ర రెడ్డి మాజీ ఉపసర్పంచ్ చల్లా రవికుమార్ రెడ్డి, నాయకులు కేతా విజయభాస్కర్ రెడ్డి, సుంకర పెంచలయ్య చౌదరి, పిడికిటి వెంకటేశ్వర్లునాయుడు, గొట్టిగుండాల బుజ్జిరెడ్డి, చిట్టమూరు వెంకటేశ్వర్లురెడ్డి, కౌన్సిలర్లు సూరా భాస్కర్‌రెడ్డి, గందల్ల వేణు, మాజీ కౌన్సిలర్ నాగభూషణమ్మ, మంతు యానాది రెడ్డి, మాదాల మస్తాన్ నాయుడు, గౌస్ మొహిద్దీన్, దండు ప్రవీణ్, సాగర్, తాటిపర్తి పెంచలయ్య, మద్దినేని నారాయణ, పయ్యావుల తిరుపతినాయుడు, మస్తాన్ వలి, కొప్పోలు రవణమ్మ, ఉదయగిరి సుధాకర్, చీదర్ల మనోజ్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆనం జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

ఆత్మకూరు అభివృద్ధి ప్రదాత మాజీ మంత్రి ప్రస్తుత వెంకటగిరి శాసనసభ్యులు ఆనం రామ నారాయణరెడ్డి జన్మదిన వేడుకలు పట్టణంలోని బిఎస్ఆర్ సెంటర్ లో పెద్ద ఎత్తున తెలుగుదేశం నాయకులు, అభిమానులు, కార్యకర్తల నడుమ ఆనం జన్మదిన వేడుకలు నిర్వహించారు. బాణాసంచా పేల్చారు. అనంతరం కేక్ కట్ చేసి పలువురికి పంచిపెట్టారు. కార్యక్రమంలో రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు పులిమి శైలజా రెడ్డి, పట్టణ అధ్యక్షులు తుమ్మల చంద్రారెడ్డి, రూరల్ మండల కార్యదర్శి కేత విజయభాస్కర్ రెడ్డి, చల్లా రవికుమార్ రెడ్డి, పిడికిటి వెంకటేశ్వర్లు నాయుడు, కౌన్సిలర్ సురా భాస్కర్ రెడ్డి, గందళ్ల వేణు, బుజ్జి రెడ్డి, మాదాల మస్తాన్ నాయుడు, చిట్టమూరు వెంకటేశ్వర్లు రెడ్డి, మద్దినేని నారాయణ, నాగభూషణమ్మ, తోడేటి వెంకటయ్య, మారుతి నాయుడు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ప్రజాశక్తి-మర్రిపాడు : మాజీ మంత్రి, వెంకటగిరి ఎంఎల్ఎ ఆనం రామనారాయణ రెడ్డి 72వ జన్మదిన వేడుకలను టిడిపి నాయకులు జనార్ధన్ నాయుడు, శాఖమూరి నారాయణ, శ్రీనివాసులునాయుడు స్థానిక ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానం సన్నిధిలో సోమవారం పూజలు నిర్వహించి కేక్ కట్ చేశారు. పొంగూరులో ఏలూరు రామచంద్రయ్య, రమణయ్య నాయుడు, శివప్రసాద్ నాయుడు ఆధ్వర్యంలో, చిన్న మాచనూరులో ఎంపిటిసి బాలగురవమ్మ, గురుస్వామిరెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, ఇర్లపాడులో దుద్దుగుంట శ్రీనివాసులు రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఇర్లపాడులో పాలఉత్పత్తిదారులకు పాలగిన్నెలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆత్మకూరు నియోజకవర్గ ఎంఎల్‌ఎగా ఉన్న సమయంలో నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేశారన్నారు. ఆరు మండలాల్లో అభివృద్ధి పనులు అమలు జరిగాయన్నారు. సోమశిల హై లెవెల్ కెనాల్ సాధనలో తమ ఆధిపత్యాన్ని ప్రదర్శించి మొదటి ఫేజ్ పనులను పరుగులు పెట్టించారన్నారు. నియోజకవర్గం అభివృద్ధికి బాటలు వేశారని ఆయన సేవలు మరువలేనివని కొనియాడారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

NOTICE
UNDER ORDER 21, RULE 22 of C.P.C.
మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు : కందుకూరు

తెలపనేని చంద్రమౌళి ... DHR
VS
బెజవాడ ప్రమీల DIED
మరియు వగైరాలు ... JDRs
టు,
R3.**బెజవాడ అభిలాష్,** S/o లేటు **వెంకటేశ్వర్లు,** R/o శామీరాపాలెం అలియాస్ కూనీ పాలెం గ్రామం, వలేటివారిపాలెం మండలం, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా.

పై నెంబర్లో డి.హెచ్.ఆర్. బెజవాడ ప్రమీలపై డిగ్రీ పొంది ఉన్నారు. పై డిగ్రీని అమలు చేసుకొనుటకై మీకున్న అభ్యంతరములను తెలియచేయుటకు శ్రీ కోర్టు వారు మీకు నోటీసు ఆర్డరు చేసినారు. కాబట్టి వాయిదా రోజు అనగా **తేది: 17-7-2023 న ఉదయం 10:30 నిమిషములకు** పై కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా కాని, న్యాయవాది ద్వారా కాని హాజరై మీ ఆక్షేపణలు చేసుకోవలెను. లేనియెడల పై పిటిషన్ మీ పరోక్షమున తీర్మానించబడును. కాబట్టి తెలియపరచడం అయినది.

వాయిదా తేది: 17-7-2023

చిట్టిబోయిన రాఘవేంద్రరావు,
డి హెచ్ ఆర్ తరపు న్యాయవాది

NOTICE
UNDER SECTION 50 of C.P.C.
మహారాజశ్రీ ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు : కందుకూరు
E.P.NO. 3/2022
O.S.NO. 115/2013

తలపనేని చంద్రమౌళి ... DHR
VS
బెజవాడ ప్రమీల DIED
మరియు వగైరాలు ... JDRs
టు,
R3.**బెజవాడ అభిలాష్,** S/o లేట్ **వెంకటేశ్వర్లు,** R/o సామీరపాలెం అలియాస్ కూని పాలెం గ్రామం, వలేటివారిపాలెం మండలం, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా.

పై నెంబర్లో డి.హెచ్.ఆర్. 1వ జెడిఆర్ పై డిక్రీ పొంది ఉన్నాడు. 1వ జె.డి.ఆర్. చనిపోయినందున డిక్రీ అమలుపరచుటకు మిమ్మల్ని 1వ జె.డి.ఆర్. వారసులుగా గుర్తించమని పిటీషన్ దాఖలు చేసి ఉన్నందున శ్రీ కోర్టు వారు మీకు నోటీసు ఆర్డరు చేసినారు. కాబట్టి వాయిదా రోజు అనగా **తేది: 17-7-2023 న ఉదయం 10:30 నిమిషములకు** పై కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా కానీ న్యాయవాది ద్వారా కానీ హాజరై మీ ఆక్షేపణలు తెలియజేసుకోవలెను. లేనియెడల పై పిటిషన్ మీ పరోక్షమున తీర్మానించబడును. కాబట్టి తెలియపరచడం అయినది.

వాయిదా తేది: 17-7-2023

చిట్టిబోయిన రాఘవేంద్రరావు,
డి హెచ్ ఆర్ తరపు న్యాయవాది